విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 09 సెప్టెంబరు 2024 8 పేజీలు

ప్రజలు అప్రమత్తం

☞కొల్లేరుకు వరద నీరు
☞ఐజి అశోక్‌కుమార్,
ఎస్పీ ప్రతాప్‌శివకిషోర్‌ల సూచన

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : కొల్లేరుకు భారీగా వరద నీరు చేరుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీస్ శాఖ చేపడుతున్న సహాయ రక్షణ చర్యలకు సహకరించాలని ఏలూరు రేంజ్ ఏలూరు ఐజి జివిజి.అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ లు కోరారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పెదపాడు మండలంలో వరద ముంపునకు గురైన గ్రామాలను ఐజి అశోక్, ఎస్పీ కిషోర్ లు ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్, పెదపాడు ఎస్ఐ శుభ శేఖర్ తో ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పెదపాడు మండలం పాత పెదపాడు, కొనికి, సత్యవోలు, నాయుడుగూడెం, వడ్డీగూడెం మరియు గుడిపాడు గ్రామాలలో ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాల మూలంగా వరద నీరు లోతట్టు ప్రాంతాలకు వచ్చి చేరటంతో ఆయా ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో వరద పరిస్థితి అడిగి తెలుసుకుని తీసుకోవాల్సిన సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ ఐజి మాట్లాడుతూ బుడమేరుకు వచ్చిన వరద నీరు పెదపాడు మండలం మీదుగా కొల్లేరు సరస్సులోకి కలిసే పెదపాడు మండలంలో పలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అందువల్ల పెదపాడు మండలంలో స్టేట్ డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్ సిబ్బంది ఐజి లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉంటున్న ప్రజలను రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి ఆదేశించారు. ప్రాణ నష్టం లేకుండా పోలీ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ప్రజలకు వివరించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఐజిని కలిసి పెదపాడు మండలంలో మూడు గ్రామాలకు వరద నీరు చేరిందని, ఏలూరు మండలంలో 18 గ్రామాలకు వరద ముంపునకు గురయ్యాయని వివరించారు. ఈ పర్యటనలో ఐజితో పాటుగా ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, పెదవేగి ఇన్స్పెక్టర్ నబీ, పెదపాడు ఎస్ఐ శుభ శేఖర్, మరియు పోలీస్ సిబ్బంది, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు జిల్లాల ఎస్పీలు సమన్వయంతో వ్యవహరించండి

గత వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో బుడమేరు వాగు పొంగిపొర్లుతుం టంతో కొల్లేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న దృష్ట్యా మూడు జిల్లాల ఎస్పీలు సమన్వయంతో వ్యవహరించి ప్రాణనష్టం లేకుండా చూడాలని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ సూచించారు. ఆదివారం ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు డిఎస్పి డి శ్రావణ్ కుమార్, ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణలతో కలిసి ఐజి అశోక్ ఏలూరు రూరల్ మండలం పెద్దఎల్లగాడి ప్రాంతంలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరదనీటి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏలూరు ▶మిగతా 2లో..

ఏపీఎస్ఆర్టీసీతో ప్రజలకు నాణ్యమైన సేవలు

❍ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో 22 నూతన బస్సులు ప్రారంభం
❍రాష్ట్రంలో 1400 నూతన బస్సులు
❍త్వరలో ఎలక్ట్రికల్ బస్సు సర్వీసులు
❍మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాబోయే రోజుల్లో ఏపీఎస్ఆర్టీసీ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకుగాను రాష్ట్రంలో 1400 బస్సులను నూతనంగా కొనుగోలు చేసి సర్వీసులను ప్రారంభించుకోవడం జరుగుతుందని రాష్ట్ర క్రీడలు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్టిసి బస్ కాంప్లెక్స్ ఆవరణలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ లతో కలసి నూతన సర్వీసుల బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడం జరుగుతుందన్నారు. ▶మిగతా 2లో

ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన 'గరికపాటి' 3లో.

లోయర్ పనుల అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టండి :ఎమ్మెల్యే చింతమనేని 4లో

మానవ తప్పిదంతోనే జలప్రళయం...

❑ ముంచుకొస్తున్న ప్లాస్టిక్ విలయం

విశాలాంధ్ర - అమలాపురం : ప్రకృతి అనేక రూపాల్లో మానవాళికి ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా వారిలో కించిత్ మార్పు రావటం లేదు ఫలితంగా ప్రతిదానిలో పెరిగిపోయిన నిర్లక్ష్యం మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేసి వారి భవిష్యత్తుని అగమ్యగోచరం చేస్తున్నాయి. గతంలో ఎంత భారీ వర్షాలు కురిసినా అరగంట లేదా గంటలో ఆ వర్షం నీరు భూమిలో ఇంకిపోయేవి ఫలితంగా ఎంత వర్షం కురిసినా నీరంతా భూమిలో ఇంకిపోవటం వల్ల ప్రకృతి చల్లబడిపోయి భూమిలో వేడి తగ్గిపోయి వాతావరణం చల్లగా ఉండేది. అప్పుడు ఇన్ని ఉపద్రవాలు వచ్చేవికావు, ఇన్ని అనర్థాలు జరిగేవి కాదు, అయితే ఇటీవల కాలంలో మనుషుల్లో వచ్చిన విపరీత ధోరణులు మూలంగా మారిన వాతావరణ పరిస్థితుల మూలంగా ప్రకృతికి పెను ప్రమాదం ముంచుకొస్తోంది. వాతావరణం ఎప్పటికప్పుడు ప్రజలను హెచ్చరిస్తూనే వుంది అయినా జనాల్లో మార్పు కానరావడం లేదు వర్షం కురిసి కాలికి మట్టి అంటకుండా ప్రతి ఇల్లు వాకిలి ప్రతి సందు గొందు ▶మిగతా 2లో

విమానాశ్రయ అభివృద్ధే ధ్యేయం

☞2025 నాటికి అదనపు టెర్మినల్ భవనం పూర్తి
☞రైతుల సమస్యలు శాశ్వత పరిష్కారాలు
☞ఎయిర్‌పోర్ట్ అధికారులతో సమీక్షా సమావేశం
☞కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర - రాజానగరం, సీతానగరం : రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధే ఎన్డీఏ కూటమి ధ్యేయమని కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నియోజకవర్గంలోని కోరుకొండ మండలంలోని మధురపూడి విమానాశ్రయం నందు ప్రజాప్రతినిధులు, ఎయిర్ పోర్టు అధికారులతో రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు అభివృద్ధికి సంబంధించి ఆదివారం జరిగిన విస్తృత స్థాయి సమావేశానికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విచ్చేశారు. తొలిసారిగా కేంద్ర మంత్రి హోదా లో విచ్చేయడంతో రాజానగరం,రాజమండ్రి గ్రామీణ, రాజమండ్రి అర్బన్ నియోజకవర్గాలు నుండి టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు భారీగా హాజరై ఘన స్వాగతం పలికారు.దీనిలో భాగంగా రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి,ఎమ్మెల్యేలు బత్తుల బలరామ కృష్ణ,ఆదిరెడ్డి ▶మిగతా 2లో

రహదారులు, డ్రైన్లు నిర్మించాలి

సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోడ్లు డ్రైనేజీలు నిర్మించాలని సీపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో రాజవరం గ్రామంలో చాంద్ర రాజేశ్వరరావు కాలనీలో, సిసి రోడ్లు, డ్రైనేజీలు లేక కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 18 సంవత్సరాల క్రితం ఈ కాలనీ స్థలాల కోసం, పెద్ద పోరాటం నిర్వహించామని అప్పట్లో సిపిఐ ఆధ్వర్యంలో పేద ప్రజలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటుంటే, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, దౌర్జన్యంగా గుడిసెలు పీకి వేయగా, సిపిఐ అప్పటి రాష్ట్ర కార్యదర్శి నారాయణ, జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోతన అప్పారావు, ప్రభుత్వంపై ఎదురు తిరిగి పోరాడి,ఈ కాలనీ పేద ప్రజల కోసం సంపాదించడం జరిగిందన్నారు. ఈ పోరాటంలో సిపిఐ నాయకులు 20 రోజులు పాటు సెంటర్ జైలుకు కూడా వెళ్లి వచ్చారని శ్రీనివాసరావు గుర్తు చేశారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ రాజేశ్వరరావు కాలనీలో సరైన వసతులు లేక, కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే సిసి రహదారులు, డ్రైనేజీలు, వీధిలైట్లు, ఏర్పాటు చేయాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి రేల నరసింహారావు, యర్రావుల గాంధీ,బొట్ట సుబ్బారావు, లక్ష్మి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి

రేంజ్ ఐజి మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుడమేరు, వాగులు వంకలు పొంగి ప్రవహిస్తూ కొల్లేరు పరివాహక ప్రాంతాలలో నీరు అధికంగా వచ్చి కృష్ణా జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాలో ఉన్న లోతట్టు ప్రాంతాలు, ఒక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. అందువల్ల పోలీసు సిబ్బంది లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ విషయంలో మూడు జిల్లాల ఎస్పీలు సమన్వయంతో ముందుకు సాగితే ప్రాణ నష్టం లేకుండా నివారించవచ్చని చెప్పారు. కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు, ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయం అస్మిలు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. అలాగే రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని ప్రజలు దాటకుండా ఉండేలాగా అన్ని ప్రాంతాలలో పోలీస్ బందోబస్తులను ఏర్పాటు చేసామన్నారు. అదేవిధంగా రహదారులపై బ్యారికేడ్లను ఏర్పాటు చేసి ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఐజి అశోక్ వివరించారు. ఈ పర్యటనలో ఐజితో పాటుగా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పడవపై ప్రయాణించిన మంత్రి నిమ్మల

విశాలాంధ్ర - పాలకొల్లు : బుడమేరు లోతు పరిశీలనలో భాగంగా ఆదివారం పడవపై ప్రయాణించారు రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు. మరో రెండు రోజులపాటు భారీవర్షం సూచనలను నేపథ్యంలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ ల ఆదేశాలతో గండ్లు పూడ్చిన ప్రాంతంలో గట్టు ఎత్తు పెంచే పనులను మంత్రి రామానాయుడు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గట్టుపైన ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ లతో సమీక్ష చేసుకుంటూ పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా కృషి చేస్తున్నారు.

విమానాశ్రయ అభివృద్ధే ధ్యేయం

మొదటి పేజీ తరువాయి

శ్రీనివాసు,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొద్దు వెంకట రమణ చౌదరి కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అదే సమయంలో వర్షం పడుతున్నప్పటికీ ఎయిర్ పోర్టు ప్రాంగణాన్ని గొడుగులు సాయంతో పరిశీలించారు. పలు మొక్కలు నాటారు.

అనంతరం విమానాశ్రయం రన్ వే, ఎయిర్ పోర్ట్ ఎక్స్ టెన్షన్, పనుల పురోగతి పనులు తదితర అంశాలపై ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ఎస్. జ్ఞానేశ్వరరావు,జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిలు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాజమండ్రి విమానాశ్రయ అభివృద్ధి అందరి లక్ష్యమన్నారు. ఎయిర్ పోర్టు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. రాజమండ్రి విమానాశ్రయం నుండి ప్రస్తుతం పది విమానాలు ద్వారా వెయ్యి మంది ప్రతి రోజు ప్రయాణాలు సాగిస్తున్నారని చెప్పారు. వీటిని మరింత పెంచేందుకు అదనపు టెర్మినల్ భవనం నిర్మాణం చేపట్టారని,అదికూడా నాణ్యత పరిణామాలు పాటిస్తూ ఆగస్టు 2025 నాటికి పూర్తి చెయ్యాలని సదరు కాంట్రాక్టర్ కి సూచినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలు అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఎన్డీఏ కూటమి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఏపీలో సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్ర,దేశాభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు.

రైతుల సమస్యలు శాశ్వత పరిష్కారాలు

రాజమండ్రి విమానాశ్రయం ఏర్పాటు సమయంలో చుట్టుపక్కల రైతులు ఎన్నో త్యాగాలు చేసి భూములు ఇచ్చారని,గత కొంత కాలంగా ఇక్కడి రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ ద్వారా తెలుసుకున్నామని చెప్పారు. వారి సమస్యలు పరిష్కారానికి శాశ్వత పరిష్కారాలు మార్గాలు చేపడతామని హామీ ఇచ్చారు. రోడ్డు పైకి వస్తున్న వర్షపు ముంపు నీటిని స్థానిక తొర్రిగడ్డ కాలువ కి అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు గంగిసెట్టి చంటిబాబు,కంటే కేశవరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, నాయకులు మింగి లక్ష్మి నారాయణ, చిట్టిప్రోల్ల పద్దరాజు, అడపా వీరబాబు,తనకాల నాగేశ్వ రావు, ఎన్డీఏ కూటమి నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మానవ తప్పిదంతోనే జలప్రళయం..

మొదటి పేజీ తరువాయి

అంత సిమెంటు రోడ్లు వేయటం వల్ల మన ఇల్లు సమీపంలో బురద అంటని సిసీ రోడ్లు వెలిసిపోవటం పెద్ద పెనుభూతంగా మారింది. మరి కురిసిన వర్షం నీరు ఎక్కడ దిగాలి, మరి ఎక్కడ భూమిలో ఇంకాలి, అన్న దానికి మానవాళి వద్ద సమాధానమే కరువయ్యింది. ఎక్కడో ఊరికి దూరంగా వున్న మురుగు కాలువలు గోదావరి సముద్రంలోనే దిగాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతే తప్ప మనం జీవించే గ్రామం పూరు పట్టణం మెగా సిటీలో కురిసిన వర్షం దిగి భూమిలో ఇంకిపోయే ఒక్క ప్రదేశం భూతద్దంలో వెతికినా కానరాదు. విజయవాడ పరిసరాల్లో సంభవించిన వరద బీభత్సంని పరిశీలిస్తే ఖతోరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కఠోరమైన మానవ తప్పిదాలు మనల్ని వెక్కిరిస్తున్నాయి. దానికి తోడు ప్లాస్టిక్ వినియోగం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయి డ్రైన్లు, మురుగు కాల్వలు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురై చుక్క నీరు దిగే మార్గం లేకుండా మూసేస్తున్నాయి. ఫలితంగా ఎక్కడ కురిసిన వర్షం అక్కడే బంద్ అవుతోంది. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైన్లలో పడేయవద్దని హెచ్చరిస్తున్నా చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా మారుతోంది. ఫలితంగా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలు మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో కొండల్ని తలపిస్తున్నాయి. దాని వల్ల వర్షాలు, వరదల వల్ల పూళ్లలోకి వస్తున్న మురుగునీరు వరద ప్రవాహం గ్రామాల్ని ముంచెత్తి వేస్తున్నాయి. గతం కంటే ఎక్కువ వర్షం కురవలేదు గతం నీ మించిన వరద రాలేదు కానీ పూళ్ళకి పూళ్ళు ఎందుకు మునిగాయి అంటే మానవుల్లో విపరీతంగా పెరిగిపోయిన స్వార్థమే కారణంగా సాక్షాత్కరిస్తుంది. ఫలితంగా ఈ జలప్రళయం సంభవిస్తుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా వినేదెవరు, కాపాడే పర్యావరణ వేత్తలు ఎవరు.

ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాం: డీపీవో

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెదపాడు మండలంలో గోగుంట, వడ్డిగూడెం, కొనికి పంచాయతీ పరిధిలో పలు గ్రామాలు ముంపుకు గురికావడం గుర్తించడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి మరియు ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు మేరకు ముంపుకు గురైన గ్రామాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ పరంగా అన్ని వసతులు కల్పించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం 400 మంది నిర్వాసితులు పునరావాస కేంద్రాల వద్ద ఉన్నారని వారందరికీ అల్పాహారం, భోజనం, తాగునీరు, వైద్య సేవలు కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాలతో ప ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వసంతవాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ పరిశీలించి నిర్వాసితులతో

మాట్లాడి భరోసా నింపారు. అనంతరం మండలస్థాయి అధికారులతో భారీ వర్షాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువైద్య శిభిరాలు సక్రమంగా నిర్వహించాలని పశువైద్య అధికారిని సంధ్యను ఆదేశించారు. మండలంలో తాగునీరు ఓహెచ్ఆర్ ట్యాంకుల వద్ద ఉన్న ప్రధాన వాల్వ్ ఛాంబర్సులో ఉన్న వర్షపు నీరు కలుషితమైనందున పూర్తిస్థాయిలో అన్ని ఛాంబర్సులో ఉన్న నీటిని తో డించాలని విస్తరణ అధికారి సూర్య కుమార్ ని ఆదేశించారు. వెంకట్ ప్రసాద్ సమీక్షలోతహసీల్దార్ ప్రసాద్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీతో

ప్రజలకు నాణ్యమైన సేవలు

మొదటి పేజీ తరువాయి

ప్రయాణికులు ఒక కన్ను అయితే కార్మికులు మరొక కన్నుని, కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి ఆరోగ్య విషయంలో జాగ్రత్తలను తీసుకోవడం జరుగు తుం న్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఆర్టీసీ స్థలాలపై ఉన్న శ్రద్ధ ఆర్టీసీ కార్మికులపై చూపించలేదన్నారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1400 బస్సులు గాను 600 బస్సులను నూతనంగా ప్రారంభించుకున్నామని, మరో మూడు మాసాల్లో మిగిలిన బస్సు సర్వీసులను ప్రారంభించుకోవడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు నాణ్యతతో కూడిన సేవలు అందించే దిశగా ఎలక్ట్రికల్ బస్సు సర్వీసులను ప్రారంభించు కొనున్నామన్నారు. రాష్ట్రంలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ సర్వీసులను ప్రారంభించే దిశగా పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ, ఆ సంస్థ యొక్క బాగోగులను చూడలేదన్నారు. ప్రయాణికులు కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం నాణ్యతతో కూడిన విధంగా సేవలు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో గత ఎనిమిది రోజులుగా పడుతున్న వర్షాలు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి ప్రకృతి విపత్కర సమయంలో గత ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు సేవలు అందించే కార్యక్రమాలను చేపట్టలేదని, కానీ వారు నేడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయటం సరికాదన్నారు. హుదూద్ వంటి విపత్తు ఎదు ర్కొనేందుకు విశాఖపట్నం అతలాకుతలం అయితే యుద్ధ ప్రాతి పదికన నగరాన్ని పది రోజుల్లో సాధారణ స్థితికి తీసుకొచ్చిన సమర్ధుడు ముఖ్యమంత్రి అని కొనియాడారు. శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు , గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, రవాణా (ఆర్టీసీ) అధికారులు రాజమహేంద్రవరం కె. షర్మిల అశోక్, కాకినాడ కె. శ్రీనివాస్‌రావు, ఎన్‌వీఆర్‌వరప్రసాద్, రాజమండ్రి డిపో మేనేజర్ ఎస్కే షబ్బం పాల్గొన్నారు.

వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న కాలువలు

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలో పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కాలువలో నుండి రాక పోకలు పూర్తి గా నిషేధించారు. వాహనాలు రాకుండా కాలువకు ఇరువైపులా బారికేడ్ లు, ట్రాక్టర్ ట్రక్కులు అడ్డుగా ఉంచి రోడ్డు నిర్బంధించారు. వరద ప్రవాహం ఎక్కువైతే వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని వాగులు ఉన్న మార్గాల్లో ప్రయాణాలు చెయ్యొద్దని ఎస్ ఐ ఎం జయబాబు హెచ్చరించారు.

ప్రజల్లో చైతన్యాన్ని రగిలించిన 'గరికపాటి'

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-కామవరపుకోట: ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కళాకారుడు గరికపాటి రాజారావు అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. గరికపాటి రాజారావు 61 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాయన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు అధ్యక్షతన గరికపాటి రాజారావు వర్ధంతి కార్యక్రమం జరిగింది. గరికపాటి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ గరికపాటి రాజారావు తన రచనల ద్వారా కళారూపాల ద్వారా ప్రజలను చైతన్య పరచడంలో దిట్ట అని అన్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో తన కలల ద్వారా, జానపద కళారూపాల ద్వారా ఎందరో కళాకారులను సమీకరించి ప్రజలను చైతన్యవంతం చేయడంలో విశేష కృషి చేశారని కొనియాడారు.

కమ్యూనిస్టుగా, ప్రజా కళాకారుడిగా ఆయన చేసిన సేవలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అటువంటి గరికపాటి రచనలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రజాకళాకారుల పాటలు సబికులను అబ్బుర పరిచాయి. అనంతరం టీవీఎస్ రాజు ఆధ్వర్యంలో

ప్రముఖ కళాకారులు తుమ్మ విశ్వేశ్వరరావు, పల్లె నారాయణ, శివదాసు, మంగళవాయిద్య కళాకారుడు చెడే సత్యనారాయణ, రమేష, ఏసు పాదం,మైక్రో ఆర్టిస్ట్ శివప్రసాద్, కోలాటం గురువులు సిరికొండ సుబ్బారావు, సిరిగినేటి జగదీ శ్వరిలను సత్కరించారు. జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.అర్ కృష్ణబాబు, సీనియర్ బుర్రకథ కళాకారులు వీర మల్ల సత్యనారాయణ,ప్రముఖ సంఘ సేవకులు షేక్ ఇబ్రహీం, వీరమల్ల మధు పాల్గొన్నారు.

గరికపాటి రాజారావు చిరస్మరణీయుడు

సీపీఐ జిల్లా సమితి సభ్యులు నామన వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - ఇరగవరం : ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు చిరస్మరణీయుడని ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో తూర్పు విప్పరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు నామన వెంకటేశ్వరరావు అన్నారు. దర్శకుడుగా ప్రయోక్తగా, నటుడుగా, ప్రజా వైద్యుడుగా రాజారావు ప్రజల కోసం పరితపించిన వ్యక్తిని నామన కొనియాడారు. ఆయన జీవితాన్ని అంతా ప్రజా కళల కోసం శ్రమించిన వ్యక్తి అన్నారు. ఆయన ఇప్టా జాతీయ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలికి అధ్యక్షుడిగా ఎన్నికై ఈ రాష్ట్రంలో 200 దళాలు ఏర్పాటు చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. రాజారావు ఏ ఆశయంకోసం అయితే పనిచేశారో ఆ ఆశయం నెరవేర్చడానికి ప్రజా కళాకారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు శివం, సత్యం, కాటూరి రాము, గుడిమెట్ల కోటేశ్వరరావు, మారెళ్ళ గురవయ్య, పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: జిల్లా వాసులు వరద బాధితులకు తోచిన సాయం చేస్తూ అండగా నిలవడం ఎంతో సంతోషించ దగిన విషయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు భీమవరం మోహన్ సర్వీస్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ప్రోప్రైటర్ కె. బాలకృష్ణం రాజు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిసి రూ.2 లక్షల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ పేరున అందజేశారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా వాసులు ముందు వరుసలో ఉండడం అభినందనీ యమని కలెక్టర్ అన్నారు.

వరద బాధితులకు నేకూరి సోషల్ సర్వీస్ ట్రస్ట్ సహాయం

విశాలాంధ్ర- ఉంగుటూరు : విజయవాడ వరద బాధితులకు ఉంగుటూరు మండలం నారాయణపురం నేకూరి సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సహాయం చేశారు. ఉంగుటూరు మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నేకూరి ఆశీర్వాదం ఆధ్వర్యంలో వరద బాధితులకు పాలు, రొట్టెలు, రస్కులు, బిస్కెట్ ప్యాకెట్లు, ట్యాబ్లేట్స్ అందజేశారు. నేకూరి లక్ష్మణ్ రావు, అనిమెల్లి సుధీర్, కొల్లి రాంబాబు, విజయ్ కుమార్, పెద్ద బంటి,నేకూరి ఆశీర్వాదం, మైఖేల్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కలిదిండి: విద్యుత్ ఘాతంతో వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కలిదిండి పంచాయతీ పరిధి ఇందిరా కాలనీ గ్రామానికి చెందిన ఊసల ఏడుకొండలు(45) మండలంలోని పోతుమర్రు పంచాయతీ శివారు గొల్లగూడెంలో కట్టా సూర్యచంద్రరావు చెరువు వద్ద పనిచేయుటకు వెళ్లి విద్యుత్ ఘాతం గురై మృతి తెలిపారు. భార్య శాంత కుమారి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడిస్తే ఊరుకోం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటి మిల్లీ మంగ రాజు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం వెంకటాపురంలో, మాల మహానాడు సమావేశం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చీకటి మిల్లీ మంగ రాజు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా మంగ రాజు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసారు. మంగరాజు మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తుంటే చూస్తూ ఊరుకోం అన్నారు.ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధం అని 2004 సంవత్సరం లో, తీర్పు నిచ్చిన,5 మంది సుప్రీంకోర్టు ధర్మాసనం, 2024 , ఆగస్టు ఒకటో తేదీన 6 మందితో,ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణ , రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చని చెప్పితే , వారిలో ఒకరైన దివేది తీర్పును వ్యతిరేకించారు అని అన్నారు. ఈ,సుప్రీం కోర్టు తీర్పు వెనక, రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. మందకృష్ణ మాలలను, గాను, దొంగలు గాను, దోపిడీ దారులుగాను,మను వాదులు గాను మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు.

సమావేశంలో రాష్ట్ర నాయకులు సిహెచ్ జైపాల్, ప్రేమ్ కుమార్, అబ్రహాం,అచ్చి బాబు, ఏసు రత్నం,శ్రీనివాస్, రాంపండు తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ప్రైవేటు పాఠశాలల సమస్యలు తీసుకువెళ్తా

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 8: ప్రైవేటు పాఠశాల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక శశికళాశాల ఆడిటోరియంలో ఆదివారం జరిగిన అపూస్మ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ప్రైవేటు పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని విమర్శించారు. ఆర్టీసీ బస్సులు తిరగనిచోట కూడా స్కూల్ బస్సులు తిరుగుతున్నాయని అలాంటి స్కూలు బస్సులపై 300 శాతం టాక్స్ విధించిన ఘనత జగన్ కే చెల్లుతుంది అన్నారు. ఈ సమస్యలన్నీ క్షేత్ర స్థాయిలో తనకు తెలుసని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేటు పాఠశాలలు అనగానే పెద్ద పెద్ద సంస్థలను దృష్టిలో పెట్టుకొని చిన్న పాఠశాలలను కూడా వారి జాబితాలో చేర్చి ఒకే విధమైన విధానాలను అమలు చేయడం కూడా సరికాదన్నారు. ఉన్నత విద్య చదువుకుని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు చిన్న చిన్న పాఠశాలలను ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారని అలాంటి వారిని ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. కచ్చితంగా అపూస్మ నాయకులు చెప్పిన సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ప్రపంచంలో ఒక మోడల్ రాజధానిగా నిర్మించుకుందాం అన్న అమరావతి ప్రాంతం వరదల్లో చిక్కుకొని అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విజయవాడ పూర్వస్థితికి వచ్చేలా కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అన్ని స్వచ్ఛంద సంస్థలు విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరు మిల్లి రాధాకృష్ణ, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆపుస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ , రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారెడ్డి , జిల్లా అధ్యక్షులు పాపారావు నాయుడు , జిల్లా కోశాధికారి ఏ. వి. వి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయ నిధికి రూ.5లక్షలు విరాళం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : విజయవాడ వరద బాధితులకు పశ్చిమగోదావరి జిల్లా నుండి వరద సహాయం కొనసాగుతూనే ఉంది. దీనిలో భాగంగా భీమవరం హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ బి.గోపాల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. కృష్ణంరాజు శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి రూ.5లక్షల చెక్కును అందజేశారు. వరదలలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలుస్తున్న దాతలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

- ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి

విశాలాంధ్ర - మండవల్లి : వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా చేయడంతో పాటు అన్ని విధాల వారికి అండగా ఉంటామని ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి చెప్పారు. వరద బాధితులకు ఎటు వంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండ వల్లి మండలంలో వరద ముంపుకు గురైన నూచుమిల్లి తదితర ప్రాంతాలను ఆదివారం ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి సందర్శించారు. ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాలకు బోటు ఏర్పాటు చేసి రోడ్డు సౌకర్యం లేని చోట వరద ప్రభావిత ప్రాంతాలకు తాగునీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పెదఎడ్లగాడివద్ద వరద పరిస్థితిని ఆర్డివో పరిశీలించారు. వారితో పాటు స్థానిక తహసీల్దార్, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పశు వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - ఏలూరు : భారీ వర్షాలు వరదలు నేపథ్యంలో జిల్లాలో పలు ప్రాంతాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహి స్తున్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం కోటేశ్వర దుర్గాపురంలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి. నెహ్రూ బాబు సందర్శించారు. స్థానిక పాడి రైతులతో ఆయన మాట్లాడుతూ గ్రామంలో పశువులకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాల పలు ప్రాంతాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు,వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మండవల్లి మండలం చింతపండు పులపర్రు,పెదపాడు మండలం గోగుంట, నూజివీడు మండలం వేంపాడు, గొల్లపల్లి,ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు,కలిదిండి మండలంలో పశు వైద్య శిబిరాలు నిర్వహించమన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో నమోదవుతున్న అధిక వర్షపాతం కారణముగా జిల్లా లోని అధికారులు వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలలో నిమగ్నమైన దృష్ట్యా నేడు సోమవారము కలెక్టర్ వారి కార్యాలయము నందు, జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయములలో జరుగు ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమము రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

31 పంచాయతీలకు నిధులు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : పోలవరం నియోజకవర్గంలో వరద పీడిత పంచాయతీలు 31 గా గుర్తించినట్లు ఎమ్మెల్యే సిరి బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఇటీవల వచ్చిన వరదలకు తన సొంత నిధులు నాలుగు కోట్ల రూపాయలు కేటాయించి నట్లు తెలిపారు. ఒక్కో పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున ప్రకటించడం జరిగింది. .ఆయా పంచాయతీల సర్పంచుల కార్యదర్శులకు సోమవారం 9వ తేదీన ఉదయం 9 గంటలకు కొయ్యలగూడెం శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో చెక్కుల పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సర్పంచులు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఎంపీపీ ఉమాకు పితృ వియోగం

విశాలాంధ్ర - కలిదిండి : కలిదిండి మండల ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు పితృవియోగం చెందారు. ఆదివారం మండలంలోని కోరుకొల్లు గ్రామంలో ఉమా స్వగృహమునందు చందన కోటేశ్వరరావు (80) పార్థివదేహాన్ని మాజీ ఎమ్మెల్యే దూలంనాగేశ్వరావు, ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ, సర్పంచ్‌లు కోటేశ్వరరావు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలియజేశారు. వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు తిరు మాని, రమేష్ బ్రహ్మాజీ, పలువురు, కోటేశ్వరరావు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయనకు ఒక కుమారుడు,ముగ్గురు కుమార్తెలు కలరు.

ఆంధ్రా క్రికెట్ ఉపాధ్యక్షునిగా పులపర్తి ప్రశాంత్

విశాలాంధ్ర -భీమవరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తనయుడు పులపర్తి వెంకట రామ ప్రశాంత్ ఆదివారం విజయవాడ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎలెక్టోరల్ ఆఫీసర్ ఎన్.రమేష్ కుమార్ ప్రశాంత్ ఉపాధ్యక్షునిగా ఎన్నికయినట్లు ప్రకటించారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ప్యానల్ ఏకగ్రీవంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ను కైవసం చేసుకోవడం విధితమే. భీమవరం నియోజకవర్గం ప్రముఖులు, అభిమానులు పులపర్తి కి శుభాకాంక్షలు తెలిపారు.

ఉధృతంగా మల్లసముద్రం అలుగు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో శని, ఆది వారాలు భారీ వర్షం పడింది. ఆదివారం 45 మిల్లీమీటర్ల వర్షం నమోదయ్యింది. ఎడతెరిపి లేని వర్షాలతో మండల ప్రజలు అతలాకుతలమవుతున్నారు. మల్లసముద్రం అలుగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీనివల్ల ధర్మాజీగూడెం రంగాపురం మార్గంలోని మల సముద్రం చెరువు సమీపంలో ఉన్న వంతెనకు గండి పడింది. దీనివల్ల వంతెన పై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో భారీ వాహనాలను వెళ్లకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకు న్నారు. మండలంలోని గ్రామాలు నీరు, బురదతో ఉన్నాయి. గ్రామాలలో కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది.

కాలువలో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-లింగపాలెం: టి.సి.హెచ్.ఆర్. పాలెంకు చెందిన పొదిల సూర్య ప్రకాష్ (33) చాట్రాయి మండలం తుమ్మగూడెంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఇతనితో పాటు ధర్మాజీగూడెం కు చెందిన రామకృష్ణ తుమ్మగూడెం లోని స్నేహితుని ఇంటికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళ్తూ కాలువలో పడిపోయిన వీరిని స్థానికులు గుర్తించి కాపాడే ప్రయత్నం చేశారు. వీరిలో రామకృష్ణ ప్రాణాలతో బయటపడగా సూర్య ప్రకాష్ మృతి చెందాడు. సూర్య ప్రకాష్ కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లోయర్ పనుల అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టండి

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : గత వైసిపి ప్రజాప్రతినిధులు చేసిన అక్రమ నిర్వాకాల వల్లే నేడు పెదపాడు మండలంలోని పలు గ్రామాలు వరద ముంపుకు గురై ఇంతలా ఇబ్బంది పడు తున్నాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చెప్పారు. లోయర్ పనులు పేరుతో డ్రెయిన్లు మరమ్మతులు చేస్తున్నట్లు వైసీపీ నాయ కులు నటించి, ఎక్కడ ఎలాంటి పనులు చేపట్ట కుండానే పనులు పూర్తయినట్టు చూపించి దాదాపు రూ.80 లక్షల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేయటానికి బిల్లులు కూడా నమోదు చేయించు కుని భారీగా అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించా రు. అందువల్ల ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి విజిలెన్స్ విచారణ చేపట్టాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్‌ను కోరారు. పెదపాడు మండలంలోని వరద ముంపు ప్రాంతా లను పరిశీలించడానికి విచ్చేసిన ఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్లకు స్థానిక వరద తీవ్రతను ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రజాప్రతినిధుల నిర్వాకం వల్ల లోయర్ పనుల పేరుతో జరిగిన భారీ అక్రమాల వల్లే నేడు పెదపాడు మండలంలోని కడిమికుంట, ఆర్పీ.పాలెం సహా పలు గ్రామాలు వరద ముంపుకు గురై ఇబ్బందులు పాలవుతున్నాయని తెలిపారు. ఈ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రభాకర్ ఐజీ అశోక్ నీ కోరారు. దీనిపై స్పందించిన ఐజి అక్రమాలపై సమగ్ర విచారణ జరిగి తగిన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల పార్టీ అధ్యక్షులు లావేటి శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జీ గుత్తా అనిల్, మాజీ ఎంపిపి మోరు శ్రావణి, ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్, పలువురు కూటమి నాయకులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలి

మేయర్ నూర్జహాన్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : విగ్నేశ్వరుని ఆశీస్సులు నగర ప్రజలందరిపై ఉండాలని స్థానిక పవర్ పేటలో వేంచేసి ఉన్న విగ్నేశ్వర స్వామి వారి ఆలయంలో 11.1/2 అడుగుల ఏకశిలా విఘ్నేశ్వర స్వామి విగ్రహానికి విశేష ద్రవ్యములతో ఏకాదశ రుద్రాభిషేకం జరిపించామని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు అన్నారు. విజయ గణపతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక పవర్ పేట శ్రీ విఘ్నేశ్వర ఆలయంలో వేంచేసి ఉన్న 100 సంవత్సరముల చరిత్ర కలిగిన11.1/2 అడుగుల ఏకశిలా విఘ్నేశ్వర స్వామి వారి విగ్రహానికి వంద సంవత్సరాలుగా వంశ పారంపార్యంగా అర్చకత్వం వహిస్తున్న అర్చకులు కందుకూరి త్రినాధమూర్తి, శబరి సంబ్రాది (బాబి) ఆధ్వర్యంలో ఆదివారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శాలువాకప్పి విగ్నేశ్వరుని చిత్రపటాన్ని బహుకరించి, స్వామివారి ప్రసాదాన్ని మేయర్ దంపతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నౌడురి శ్రీనివాస్, చీర్ల శ్రీనివాస్, ఆలబిల్లి వెంకటేష్, జవ్వాజి గోపాల్, గంటా రాంబాబు, వీరవల్లి రామకృష్ణ, మహాలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తులను ఆకట్టుకుంటున్న గోల్డ్ మార్కెట్ "బంగారు గణేశుడు"

విశాలాంధ్ర - పాలకొల్లు : గణపతి నవరాత్రులలో భాగంగా పాలకొల్లు పట్టణంలోని గోల్డ్ మార్కెట్ వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బంగారు వర్ణంలో ఉన్న గణేశుడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. తాళాబత్తుల సింహాచలం ఆర్థిక సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బంగారు చాయతో విగ్రహం ఆకర్షణీయంగా ఉంది. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గణనాథుడిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాల వితరణ జరిగింది.

ప్రమాదకరంగా సింగగూడెం రహదారి

విశాలాంధ్ర-లింగపాలెం:అధిక వర్షాలతో రంగాపురం వెళ్లే మార్గంలో సింగ గూడెం వద్ద రోడ్డుకి గోతులు పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉంది. సింగగూడెం లోని ఊరి మధ్యలో ప్రధాని రహదారిపై గోతులు పడ్డాయి. వీటిలో నీరు నిలిచి ప్రమాదకరంగా మారాయి. గోతులలో నీరు ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటిలో నీరు ఉండటంతో గోతులు తెలియటం లేదు. దాదాపు 200 మీటర్లు ప్రమాదకరంగా ఉంది.

10న విశాఖ ఉక్కు పరిరక్షణకు రాస్తారోకో

విశాలాంధ్ర-ఏలూరు: విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ పట్ల కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఈనెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వ ర్యంలో రాస్తారోకో కరపత్రాలను విడుదల చేశా రు. పదో తేదీ జరిగే రాస్తారోకోలు కార్మికులు, ప్రజాసంఘాలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా కళాకారుడు 'గరికపాటి'

విశాలాంధ్ర -భీమవరం: ప్రజలు చైతన్యవంతులు కావడానికి కళలను ఆయుధంగా చేసుకుని ప్రజల మధ్యకు వెళ్లి కళారూపాలతో చైతన్య వంతుల్ని చేసిన ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్ అన్నారు. గరికపాటి రాజారావు 6వ వర్ధంతి ఆదివారం ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ కళ కళ కోసం కాదని కళ ప్రజల కోసం అని తాను నమ్మిన సిద్ధాంతాన్ని స్వాతంత్ర ఉద్యమ కాలంలో పాటలు బుర్రకథలు హరికథలు నాటకాలు నాటికలు జానపద కళారూపాల ద్వారా ఎందరో కళాకారులను సమీకరించి ప్రజలను చైతన్యవంతులు చేసిన గొప్ప ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు అన్నారు. ప్రజా వైద్యుడుగా ఉచితంగా ప్రజలకు వైద్యం అందించి మానవత్వాన్ని చాటుకున్నారని ఆయన కొనియాడారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రజా కళలను ప్రజల మధ్యకు తీసుకు వెళ్లడంలో ఆయన ఎన్నో కష్టాలు పడ్డారని ఆనాడు ఆయనకు సహకరించిన అక్కినేని, అల్లు రామలింగయ్య వంటిఎందరో కళాకారులు సినిమా కళాకారులుగా ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. తొలుత గరికపాటి చిత్ర పటానికి కళాకారులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో కళాకారులు చాన్ భాషా, కళారంజని అధ్యక్షులు జవ్వాది దాశరథి శ్రీని వాస్, ఆక్వా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరులో వ్యక్తి దారుణ హత్య

విశాలాంధ్ర-ముదినేపల్లి : ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలో జరిగిన హత్యఘటనతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఎప్పుడు ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతం హత్య ఘటనతో భయం గుప్పెట్లోకి నెట్టింది. మృతుని కుమారుడు పోసిన చైతన్య ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఊటుకూరుకు చెందిన పోసిన బాలకోటయ్య (51) ఈనెల 7వ తేదీ ఉదయం మల్లపరాజుగూడెం గ్రామంలో పని చేస్తున్న జెసిపి వద్దకు ఆయిల్ క్యాన్ ఇవ్వడానికి బయలుదేరాడు. జెసిపిలో ఆయిల్ పోసిన డ్రైవర్ మరో క్యాన్ తీసుకొనిరామనగా బాల కోటయ్య పల్సర్ మోటార్ బైక్ పై ఊటుకూరులో ఇంటికి వస్తున్నాడు. ఉదయం 9 గంటలకు పాలడుగు బాబూరావు ఫోన్ చేసి నీ తండ్రి బాలకోటయ్య చెరువు దగ్గర రోడ్డు మార్జిన్ వద్ద పడి మెడ వెనుక భాగమున , తలపై ముఖంపై నరికి రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నాడని కుమారుడు చైతన్య ప్రసాద్ తెలిపాడు. నేను మా కుటుంబ సభ్యులతో ఘటన స్థలానికి వెళ్లగా చనిపోయి రక్తపు మడుగులో ఉన్నట్లు గుర్తించాను

పాత కక్షలు కారణమా :

మా తండ్రి హత్యకు పాత కక్షలే కారణమని కుమారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మా మేనమామలతో పాత కక్షలు పురస్కరించుకుని ఈ హత్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై వెంకట్ కుమార్ గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

'బేటి బచావో బేటి పడావో' కార్యక్రమం

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు ఐసిడియస్ ప్రాజెక్టు పరిధిలో కొవ్వూరు నందు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ్ వారి ఆద్వర్యం లో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బేటి బచావో బేటి పడావో లో భాగంగా డివిజన్ స్థాయి బాల్య వివాహాల నిలుపుదల మరియు బాల్య వివాహాలపై అవగాహన సమావేశము నిర్వహించడమైనది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ, బాల్య వివాహాల వలన జరిగే నష్టాలు గురించి ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శ కాలు మేరకు బాల్య వివాహాల జరుగకుండా కమిటీలు ఏర్పరచినట్లు తెలి పారు. ఈ కార్యక్రమములో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజకుమార్ కొవ్వూరు సిడిపిఓ మమ్మీ బాల్య వివాహాలు, చట్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో కొవ్వూరు టౌన్ సిఐ విశ్వం, డివిజనల్ పంచాయతీ అధి కారి, కొవ్వూరు, చాగల్లు, తాళ్ళపూడి మండలాలకు చెందిన తహసిల్దారులు, ఎంపిడివోలు, ఎమ్ఈవోలు సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

ఏటిగట్లు పరిశీలించిన అమలాపురం డీఎస్పీ

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని పల్లంకుర్రు శివారు బూలవారి మొండి వద్ద బలహీనంగా ఉన్న ఏటి గట్టును అమలాపురం డిఎస్పి టిఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం పరిశీ లించారు. అలాగే పల్లంకుర్రు రేవు, కుం డలేశ్వరం, నడవపల్లి గ్రామాల్లో ఏటిగట్ల ను ఆయన పరిశీలించారు. వరదల్లో ఏ ప్రమాదం సంభవించకుండా ముం దు జాగ్రత్త చర్యలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులకు డీఎస్పీ సూచించారు. అంతకుముందు కాట్రేనికోన పోలీస్ స్టేషన్ను సంద ర్శించి రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి సకాలంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిఎస్పి ప్రసాద్ సిబ్బందిని కోరారు. ఆయన వెంట కాట్రేనికోన ఎస్సై అవినాష్ పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీగా "సానా సతీష్ బాబు"

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీగా సానా సతీష్బాబు ఫౌండేషన్ వ్యవస్థాపకులు సానా సతీష్బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ క్రీడలపై తనకున్న అపారమైన అభీష్టం- మక్కువతోనే నేడు ఈ అత్యున్నత హోదా దక్కిం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుండి క్రీడలపై మక్కువ-తగిన నైపుణ్యం కలిగిన యువతను వెలికితీసి క్రీడల్లో ప్రోత్సహిస్తామని తెలిపారు. ఇకపై రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన మంగళగిరి, కడప ప్రాంతాలలో కూడా 'అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ల నిర్వహణకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

బేతినీడి తరణికి అభినందనలు

విశాలాంధ్ర - అమలాపురం : యుటిఎఫ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ మీనాల కుమార్తె డాక్టర్ తరణి ఇటీవల ఆలిండియా నీడ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్లో 2127 ర్యాంకు సాధించిన సందర్భంగా నేడు పలువురు ఆమెను వారి నివాసం రాజోలులో కలిసి హృదయ పూర్వక అభినందనలు తెలియజేసారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ జ్యోతిబసు జిల్లా ఆఫీసు బేరర్స్ సభ్యులు జివి రమణ, వై మురళీమోహన్, వైవిఎస్ఎన్ బాలాజీ మరియు వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ జ్యోతిబసు మాట్లాడుతూ వైద్యరంగంలో పేదలకు ప్రజలకు మంచి ఉత్తమ వైద్యసేవలు అందించి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జాతీయ రహదారిపై పలు కూడళ్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ

విశాలాంధ్ర - రాజానగరం : జాతీయ రహదారి పై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివా రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తూర్పు గోదావరి జిల్లా ఎస్పి డి.నరసింహ కిషోర్ అన్నారు. మండలంలోని జాతీయ రహదారి పై సూర్యారావు పేట దుర్గమ్మ ఆలయం కూడలి, నరేంద్ర పురం కూడలి, జిఎస్ఎల్ హాస్పిటల్ తదితర ప్రాంతాలను ఎస్పి నరసింహ కిషోర్ ఆదివారం పరిశీలించారు. దీనిలో భాగంగా తరుచూ ప్రమాదాలు జరిగే ప్రదే శాలలో కాషనరీ బోర్డులు మరిన్ని పెంచాలని అధి కారులను ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాల న్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ముం దస్తు జాగ్రత్తలను అధికారులకు వివరించారు. అనంతరం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి రోజు నేషనల్ హై వే పై ప్రమాదాలు జరిగి ఎంతో మంది తమ విలు వైన ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. ప్రమాదాలు నివారించడానికి దృష్టి సారించి, ఈ ప్రమాదాలు జరగకుండా అడ్డుకట్ట వేయడానికి నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సంప్రదించి, ప్రమాదాల నివారణ కొరకు ప్రత్యక ప్రణాళిక రూపొందించామన్నారు. వాహనదారులు తమ వాహనాలు నడిపే సమయంలో మరిన్ని జాగ్రతలు పాటించాలని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఎస్పీతో పాటు ఇన్స్పెక్టర్ (ఎస్ బి) ఏ. శ్రీనివాస రావు, రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, సబ్ ఇన్స్పెక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్నహస్తాల సహాయార్థం

విశాలాంధ్ర - అనపర్తి : రంగంపేట శ్రీ భారతీ యూపి స్కూల్ విద్యార్థులు విజయవాడలోని ముంపు బాధితుల సహాయార్థం సేకరించిన సొమ్ము ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కి అందచేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం మహాలక్ష్మి, కరస్పాం డెంట్ ఉమామణి విద్యార్థులు సేకరించిన రూ.32 వేలు డిడిని సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డికి అందచేశారు. ఈ కార్యక్రమంలో రం గంపేట టీడీపీ నేత సత్యనారాయణ ఉన్నారు.

మాజీ ఎంపీపీ రూ.2లక్షల విరాళం :

సీతానగరం: మండలంలో చినవంగలపూడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సురెడ్డి నరేంద్ర బాబు జానికి ఇరువురు విజయవాడ వరద బాధి తులకు సహాయార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యంత్రి నారా చంద్రబాబునాయుడుకి 2 లక్షల రూపాయల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా సూరెడ్డి నాగేంద్రబాబు మాట్లాడుతూ వరదల వల్ల సర్వం కోల్పోయిన బాధితులకు ప్రతీ ఒక్కరూ తమకు తోచిన సహాయఅందించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సంగణ చినపోసియ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎన్డీయే నాయకులు రూ.2 లక్షల విరాళాలు సేకరణ :

సీతానగరం: మండలంలో రఘుదేవపురం ఎన్డియే కూటమి గ్రామ నాయకులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం గ్రామం మొత్తం తిరు గుతూ 2లక్షల 15వేల రూపాయలు నగదును విరా ళాల రూపంలో సేకరించారు. సేకరించిన నిధి ని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు చెక్కు రూపంలో అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితు లకు సహాయం చేసినందుకు రఘుదేవపురం గ్రామ కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎవరికి తోచిన విధంగా వారు వరద బాధి తులకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో కాండ్రు శ్రీనివాసరావు, చుండ్రు సత్య ప్రసాద్, కాండ్రు కాశి విశ్వనాథం, దాసరి రమేష్ మొదలగు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల దాతృత్వం

ఉండ్రాజవరం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం చిన్నారులు దాతృత్వం చూపారు. మండలంలోని వేలివెన్ను శశిలో ఆరోతరగతి చదు వుతున్న చిన్నారులు కోమట్లపల్లి లాస్య, ముళ్ళ పూడి హరి మోక్షిత ఇరువురు కలిసి రూ.10,457 ముఖ్యమంత్రి సహాయనిధికి అందించేందుకు నిడద వోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు అంద జేశారు. ఈ సందర్భంగా శేషారావు ఆ చిన్నారుల సేవా దృక్పధానికి అభినందనలు తెలిపారు.

చిక్కని చిరుత

- అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్న చిరుతపులి
- భయాందోళనలో ప్రజలు
- ప్రజలు ఒంటరిగా తిరగొద్దు
- జిల్లా అటవీశాఖ అధికారి ధరణి



విశాలాంధ్ర - రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని దివాన్ చెరువు అటవీ శాఖకు చెందిన భూముల్లో రెండు రోజులు గా చిరుత పులి సంచరించడంతో స్థానిక ప్రజలకు కంటిపై కునుకు పట్టడంలేదు. ఎప్పుడు ఏం జరుగు తుందో అన్న బయంతో హౌసింగ్ బోర్డు,ఆటోనగర్ తదితర ప్రాంత ప్రజలు భయాందోళనలో ఉన్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు చిరుతను బంధించేందుకు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి(డిఎఫ్వో) ఎస్. ధరణి స్థానిక విలేఖర్ల తో ఆదివారం మాట్లాడుతూ రెండు రోజులుగా చిరుత పులి దివాన్ చెరువు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో సంచరు స్తుందని, చిరుతను పట్టుకునేందుకు వివిధ చర్యలు చెప్పట్టినట్లు చెప్పారు. శనివారం రాత్రి నుండి ఎడ తెరపు లేకుండా వర్షం పడుతున్న కారణంగా చిరు త పులి పాద ముద్రలు గుర్తించడం కష్టత రంగా మారిందని, అలాగే ట్రాప్ సీసీ కెమెరాల్లో సైతం ఎక్కడ కూడా చిరుత కనిపించలేదని చెప్పారు. అం దుకు చిరుత పులులు వర్షంలో తడవ దానికి ఇష్టపడ వని, దట్టమైన అడవుల్లో దురిపోతాయని చెప్పారు. ఆటోనగర్లో ఒక కాంపౌండ్ వాల్ పై చిరుత ఉన్నట్లు గుర్తించినట్లు స్థానికులు ఫోన్ చేశారని సమాచారం రావడంతో వెంటనే తమ సిబ్బంది అక్కడకు చేరుకొని పరిసరాలు పరిశీలం చినా ఫలితం లేదన్నారు. త్వరలో పట్టుకుంటామని చెప్పారు. దివాన్ చెరువు, ఆటోనగర్ ప్రాంతంలోని నగర వనాన్ని నేటి నుండి ఈనెల16 వరకు వారం రోజులు పాటు నగర వనం మూసివేసినట్లు చెప్పారు. రిజర్వ్ ఫారెస్ట్కి అనుకుని ఉన్న తోటల్లోకి రైతులు ఒంటరిగా వెళ్ల వద్దని,గుంపులుగా వెళ్ళా లని, రాత్రి సమయంలో పొలాల్లో,తోటల్లో ఎవరు ఉండవద్దని హెచ్చరించారు. రాత్రి సమయంలో సంచరించే వారు తప్పనిరిగా టార్చ్ లైట్ తమ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. చిరుత గుర్తులు తో కూడిన కరపత్రాలు ప్రజలకు పంచిపెటామని వాటిలో ఉన్న చిరుత పులి పాద ముద్రలు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. చిరుతను పట్టుకునేందుకు ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో కమిటీ వేసి నట్లు తెలిపారు. చిరుతను బంధించేందుకు మొత్తం 50 ట్రాప్ సీసీ కెమెరాలు 4బోన్లు అమర్చిమామని తెలిపారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా చిరుత సంచరిస్తే టోల్ ఫ్రీ నెంబర్ కి 18004255909 కి కాల్ చేసి సమా చారం అందించాలని డిఎఫ్వో ధరణి తెలిపారు. ఈ సమావేశంలో అకాడమి ఎఫ్ఎస్వో జివి పద్మజ, ఎఫ్బివోగ్లోరీ ఆశ, వివిధ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీగా అరిగెల అరుణకుమారి

విశాలాంధ్ర - పెరవలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిసిసి జనరల్ సెక్రెటరీగా పెరవలి మండలం ముక్కా మల గ్రామానికి చెందిన అరిగెల అరుణకుమారిని నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి విజయవాడలో అరిగెల అరుణకుమారికి నియా మక పత్రం అందజేసినట్లు ఆమె విలేకరులకు తెలి పారు. పిసిసి కమిటీలో అవకాశం కల్పించినందుకు షర్మిలా రెడ్డికి అరుణకుమారి ధన్యవాదములు తెలిపారు.అరుణకుమారి ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలుగా కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగాను కొనసాగుతున్నారు. అరుణ కుమారికి రాష్ట్రస్థాయి కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పదవి రావడం పట్ల కొవ్వూరు నియోజకవర్గ కార్యకర్తలు ప్రజలు పెరవలి మండల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ముక్కా మల గ్రామ సర్పంచ్ గా పనిచేసి అంచలంచెలుగా రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నాయకత్వం లోకి ఎదిగిన అరుణ కుమారిని ముక్కామల గ్రామస్తులు అభినందించారు.

గణేష్ మండపాలను దర్శించుకున్న ఎమ్మెల్యే నెహ్రూ

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని గణేష్ మండపాలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ శనివారం దర్శించుకున్నారు. వినా యక చవితి పర్వదినం పురస్కరించుకుని మండల కేంద్రంలో అనేక మండపాలను ఏర్పాటు చేశారు. తొలుతగా జగ్గంపేట నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి కోకోకోలా డిపోలో నిర్వహించిన వినాయక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎంప్లాయిస్ కాలనీ, ఎరకల కాలనీ, నెహ్రూ కాలనీ, టాక్సీ స్టాండ్, ఆటో స్టాండ్లు, శ్రీరాంనగర్, పద్మనాభ నగర్, శెట్టి బలిజ కాలనీ, సంఘం వీధి, గెద్ద పేట, మార్కెట్ సెంటర్, జయ నర్సింగ్ హోమ్, తదితర కాలనీలో గల గణేష్ మండపా లను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుని కరుణకటాక్షా లతో విఘ్నాలను తొలగించి అందరిని రక్షించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, రుచి హోటల్స్ నాగేంద్ర, డాక్టర్ రమేష్, వేములకొండ జోగారావు బచ్చల సుధీర్, పీలా మహేష్, నాండ్ల చిరంజీవి, కొండ్రోతు శ్రీను, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - రావులపాలెం : కొత్తపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రౌతు ఈశ్వరరావు కాశి డాక్టర్ రావుల పాలెం క్యాంప్ కార్యాలయం వద్ద గత రెండు రోజులు గా తుఫాన్ ప్రభావం తో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతా వరణ శాఖ అధికారులకు హెచ్చరికలు జారీ చేయడం వల్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రభుత్వ అధికారులను ఆయన ఒక ప్రకటన లో కోరారు. ప్రజలు అవసరం ఉంటేనే బయటికి రావాలని లేని పక్షంలో ఇంటి వద్ద ఉండాలని ఆయన తెలిపారు. ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అధికారుల సూచనలు పాటించాలి

కొత్తపేట జనసేన పార్టీ ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండా లని కొత్తపేట నియోకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బం డారు శ్రీనివాస్ కోరారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికలు జారీ చేయడం మ్యాప్ ఉద్యమంలో ప్రజలు ప్రభుత్వం అధికా రులు అందిస్తున్న సూచనలను పాటిస్తూ రక్షణ పొందాలని సూచించారు. ప్రజలు అవసరం ఉంటేనే బయటికి రావాలని ఆయన సూచించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర - రావులపాలెం : పశ్చిమగోదావరి జిల్లా తిరుపతిపురం గ్రామానికి చెందిన కంబాల లక్ష్మి భర్త పేరు సత్యనారాయణ వయసు 58 సంవత్సరాలు కులము శెట్టిబలిజ అను ఆమె తన కుమార్తెను చూసేందుకు వాడపల్లి గ్రామం వచ్చి తిరిగి తన స్వగ్రామం వెళుతుండగా రావులపాలెం మండలం గ్రామ పరిధిలో గల ఆర్టీసీ ఇన్ గెట్ వద్ద వెనుక నుండి వస్తున్న ఏపీ 05 జెడ్ 52 75 నెంబర్ గల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపే ఆమెను ఢీకొనగా అక్కడికక్కడే చనిపోయినట్లు మృతురాలి అల్లుడైన చిట్టూరి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రావులపాలెం ఎస్సై తెలిపారు.

కొండెక్కిన కూరగాయల ధరలు..
వినియోగదారుల బెంబేలు

విశాలాంధ్ర - కొవ్వూరు : అందరూ ఊహించిన విధంగానే కూరగాయ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. వ్యాపారులు చెబుతున్న ధరలతో వినియోగదారులు హడలిపోతున్నారు. ఏం కొనేది.. ఏం తినేది అన్న చందాన అయో మయ స్థితిలో ఉన్నారు. ఎక్కడో విజయవాడలో వరదలు వస్తే దాని ప్రభావం మనమేంటి అని ప్రశ్నించుకుంటున్నారు. కొందరు వ్యాపారులైతే తెలివితేటలుగా ఇక్కడున్న కూరగాయలు విజయ వాడకు రవాణా జరిగినందున ఆ ప్రభావం వల్ల ధరలు పెరిగాయని చెబుతున్నారు. మరి కొందరు ఇక్కడ కూడా కంటిన్యూగా వర్షాలు పడుతున్నం దున ఆ ప్రభావంతో మార్కెట్ లోకి కూరగాయల సప్లై డిమాండ్కు తగ్గట్టుగా సరఫరా కాకపోవ డంతో ధరల పెరుగుదలకు కారణం మనీ చెప్పు కొస్తున్నారు. ఇదిలా ఉంటే కొవ్వూరు నియోజక వర్గంలో కొవ్వూరు మండలం తాళ్లపూడి మండ లాలు కూరగాయల పంటకు ప్రసిద్ధి చెందాయి ఆకుకూర దగ్గర నుంచి వంకాయలు దొండ కాయలు, బెండకాయలు వంటి కూరగాయలు విస్తారంగా పండుతున్నాయి మరోవైపు టమాట పంట కూడా సాగు అవుతుంది. గత కొన్ని రోజు లుగా కొవ్వూరులో నిమ్మకాయలు దొరకటం లేదు ఇదేమని ఆరాతీస్తే హోల్సేల్ లోనే నిమ్మకాయ ఒకటి ఐదు రూపాయలు పడుతుందని అంత రేటుతో తెచ్చి మేము విక్రయించేదెలగని రిటైల్ వర్తకులు చెబుతున్నారు. నిన్న మొన్నటి వరకు పది రూపాయల నుంచి 15 రూపాయల వరకు అమ్మిన ఆనపకాయ, పొట్లకాయ ధర లు ఉండగా ఈరోజు అవి 40 రూపాయలకు చేరింది. ఇక బీరకాయలు వంకాయలు చిక్కుడుకాయలు ధరలు కిలో 90 నుంచి వంద రూపాయలు వరకుఅమ్ము తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో దళారులు కూరగాయ నిలవలనుదాచి రేట్లు పెంచి రిటైల్ వ్యాపారులను తద్వారా వినియోగదారుల నుంచి దోచుకుంటున్నారు అన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. ధరలను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టాను సారం ధరలు నిర్ణయించి విక్రయాలు జరుగు తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా వైద్యుడిగా గరికపాటి సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తూర్పుగోదావరి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈరోజు స్థానిక రామచంద్రారావుపేటలో ఉన్న డాక్టర్ గరికపాటి రాజారావు 61వ వర్ధంతి సందర్భంగా రాజారావు విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. ముందుగా సీనియర్ కళాకారిణి ప్రజా గాయకురాలు ప్రముఖ నటి బీ. ఉమామహేశ్వరి రాజారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ముప్పన కుమారస్వామి పూలమాలవేసి నివాళులర్పించారు. తదుపరి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహంతి లక్ష్మణరావు నివాళులర్పిస్తూ మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ గరికపాటి రాజారావు కృష్ణాజిల్లాలో జన్మించి ప్రజా వైద్యుడిగా, ప్రజా కళాకారుడిగా, సిని మా దర్శకుడిగా, నాటక ప్రయోక్తగా ప్రజానాట్యమండలి పునర్నిర్మాతగా జాతీయ కార్య దర్శి గా కళా రంగానికి ఎంతో సేవ చేశారని తెలియజేశారు. స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో ఉన్నరాజారావు విగ్రహానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహంతి లక్ష్మణరావు, ముప్పన కుమార స్వామి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీని యర్ సిటిజన్ ప్రజా సంక్షేమ వేదిక ఆర్గనైజర్ కార్యదర్శి కాసాని శంకర్రావు , ప్రజా నాట్య మండలి రాజమండ్రి సిటీ కార్యదర్శి ఎస్. డి.బి నవరోజ్, పేపర్ మిల్ నాయకులు రామకృష్ణ , సీనియర్ సిటిజన్ ప్రజా సంక్షేమ వేదిక కార్యవర్గ సభ్యులు, గాయకులు, నరేంద్ర బాబు , కాఫీ హోటల్ సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చవితి పందిళ్లకు నగర సమితి ఆహ్వానం

విశాలాంధ్ర - కాకినాడ : నవరాత్రుల సందర్భంగా నగరంలో 624 వినాయక పందిర్ల నిర్వహణ జరుగుతోంది. 126 వరకు అయిదు అడుగుల విగ్రహాలు ఏర్పాటు చేయ గా 13 అడుగుల విగ్రహాలు 52 వరకూ వున్నాయి. వీటిలో చాలా వరకు వాకలపూడి సముద్ర తీరానికి తరలి వెళ్లే అవకాశం వుంది. ఇదిలా వుండగా నగర గణేశ ఉత్సవ సమితి పందిర్ల నిర్వా హకులకు ఆహ్వాన పత్రాలు స్వయంగా అందజేసి స్వాగతిస్తున్నారు. ఆదివారం ఉదయం భోగిగణపతి పీఠంలో సమితి బృందం పూజలు నిర్వహించి పలు ప్రాంతాల్లో పర్యటించి వివిధ కమిటీలతో భేటీ అయ్యారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఎస్పీ ఆర్డివో డిఎస్పి ప్రభుత్వ పరంగా సంపూర్ణంగా సహకరిస్తున్నారని తెలియజేసారు. గోల్డ్ మార్కెట్ సెంటర్లో వెండి, బంగారు, డైమండ్ వర్త కుల సమాఖ్య ఆధ్వర్యాన 85వ వార్షిక ఉత్సవాలను అభినందించారు. అధ్యక్ష కార్యదర్శులు అనిశెట్టి రామకృష్ణ, మహడిక్ శ్రీనివాస్ సభ్యు లను స్వాగతించారు. సాలిపేట దేవాదాయ శాఖ ఆలయం జగన్నాథపురం, సాంబమూర్తి నగర్, పాత బస్ స్టాండ్ ప్రతాప్ నగర్ ప్రాం తాల్లో వినాయక మండపాలకు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమితి అధ్యక్షులు దూ సర్ల పూడి రమణ రాజు, జిల్లా కన్వీనర్ యెనిమి రెడ్డి మాలకొండయ్య, దిలీప్ కుమార్, సద నాని పర్యటించారు. రమణ రాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 4వేల మందికి అభినందన పత్రాలు అందిస్తామన్నారు. మండపాల్లో నెలకొల్పిన గణపతి విగ్రహాల ఫోటో కమిటీ పేరు నిర్వాహకుల చిరునామా 99481 46999 సమితి నంబర్కు వాట్సప్ చేస్తే సంబంధిత ఏరియా పదాధికారులతో అందిస్తామన్నారు. మాలకొండయ్య మాట్లాడుతూ సిటీ వినాయక సాగర్లో లాంచనప్రాయంగా వాహనాల ప్రవేశం లేని విగ్రహాలు నిమజ్జనం చేసే నిర్వహణ ప్రశంసతా పత్రాల బహుకరణ వేదిక ఏర్పాటవుతుందన్నారు.

విద్యార్థులకు స్కాలర్షిప్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ కల్పన సెంటర్ గాంధీ భవన్లో క్రియా స్వచ్ఛంధ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ విద్యార్థులకు స్కాలర్షిప్ చెక్కులు పంపిణీ కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంస్థ యజమానులతో కలిసి విద్యార్థులకు స్కాల ర్షిప్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పంతం నానాజీ కార్య క్రమాన్ని ఉద్దేశించి మీడియాతో మాట్లాడుతూ ఇంతటి చక్కటి కార్యక్రమానికి ఆహ్వానించిన క్రియా స్వచ్ఛంధ సంస్థ యజ మానులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వారి చేతుల మీదు గా స్కాలర్షిప్ చెక్కులు పంపిణీ చేయడం ఆనందాన్ని ఇచ్చిం దని వారు పేర్కొన్నారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని చేప ట్టిన తిమ్మాపురం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బత్తుల దొర బాబు (గణేష్)కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ మరియు బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చతుర్థి వేడుకలు

విశాలాంధ్ర - సీతా నగరం: ఊరు, వాడ భక్తి శ్రద్ధలతో వినాయక చతుర్థి వేడుకలు మండల వ్యాప్తంగా అన్ని గ్రామా లలో ఘనంగా నిర్వహి స్తున్నారు. 21 పంచాయ తీల పరిధిలో మొత్తం 69 గణేష్ మండ పాలకు మండల ప్రత్యేక కమిటీ అధికారులు అనుమతులను జారీ చేసిన సంగతి అందరికి తెలిసిందే. అయితే వినాయక చతుర్థి పురస్కరించుకొని వినాయక మండ పాలను సర్వాంగ సుందరంగా అలంకరించి తెల్లవారుజాము నుండి భక్తులు గణేషునికి ప్రత్యేక పూజలు చేశారు. దీనిలో భాగంగా రఘు దేవపురం చెరువు వద్ద గల వినాయకుడు గుడిలో కొలువు తీరిన గణనాయకునికి మండపం పువ్వులు, వివిధ రకాల పండ్లతో సుందరంగా అలంకరించడంతో భక్తు లు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాల్లో కూడా రక రకాల అలంకరణలతో గణేష్ చతుర్థిని జరుపుకున్నారు.

బాధితునకు ప్రజాసేవ ఫౌండేషన్ సాయం

విశాలాంధ్ర - కాట్రేని కోన : కాట్రేనికోన గ్రామ శివారు గచ్చకాయల పోరకు చెందిన అవనిగడ్డ హరికృష్ణ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి జీవనోపాధి లేక ఇంటి వద్దనే ఆర్థికంగా బాధ లు పడుతూ జీవనం సాగిస్తు న్నాడు. స్థానిక ప్రజాసేవ యూత్ ఫౌండేషన్ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి పదివేల రూపాయలు ఆర్థికసాయంను బాధితుడు హరికృష్ణకు ఆదివారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు మానవతాదృక్పథంతో ముం దుకు వచ్చి సాయం అందించడం పట్ల పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి సెంటర్ వద్ద ద్విచక్ర వాహనంపై వ్యక్తి రోడ్డు దాటుతుండగా రాజమండ్రి వైపు నుండి విశాఖపట్నం వైపుకు వెళ్లే కారు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలు అయినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన పోతుల వీరబాబుకు మోకాలికి బలమైన గాయం తగిలింది. కారు ద్విచక్ర వాహనదారుడిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోవడంతో కృష్ణవరం టోల్గేట్ వద్ద సమాచారం ఇచ్చినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. దీనిపై విచారణ జరిపి దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు.

స్వయంపాకాల పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : వినాయక చవితి పర్వదినాన్ని పుర స్కరించుకొని పేదబ్రాహ్మ ణులకు సంఘ ఉపాధ్య క్షులు గరిమెళ్ళ లక్ష్మి నారాయణ శర్మ సహకా రంతో స్వయంపాకాల రూపంలో బియ్యం తోపాటు వంటసామగ్రిని అందచే సామని సంఘ వ్యవ స్థాపక అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణ మూర్తి తెలి పారు. బ్రాహ్మణ అభి వృద్ధి సమాఖ్య సేవా సంఘ ఆధ్వర్యంలో స్థానిక అశోక్ నగర్‌లో వున్న సంఘ కార్యాలయంలో శనివారం ఉదయం పంపిణీ కార్య క్రమాన్ని సంఘ గౌరవ సలహాదారులు, కార్యవర్గసభ్యుల చేతులమీదుగా బ్రా హ్మణులకు అంద చేసారు. పసుమర్తి మాట్లాడుతూ పండుగపూట ఈస్వయం పాకం యివ్వడం వల్ల వారివారి గృహాలలో భగవంతునికి నివేదనచేసి భోజనం చేస్తారన్న భావన తో ఈకార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. సంఘకార్య క్రమాలు పారద ర్శకతతో నిర్వహించన్నదే తమ అభిమతమని చెప్పారు. ముఖ్య సలహాదారులు నాగ మహాశయ, మంజులూరి విశ్వేశ్వర రావు, యార్ల ప్రగడ పద్మనాభ స్వామి, అధ్యక్షులు డాక్టర్ ఐవి రావు, సీనియర్ అడ్వకేట్ అయ్య వెంకటేష్, వై వెంకటేష్(ఉడిపి హోటల్)న్యాయమూరి న్యాయమూర్తి చాగంటి నాగేశ్వరావు, ఇంద్రగంట శ్రీనివాస్, హౌతా శివ భాస్కర్, దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ళ లక్ష్మీనారాయణ శర్మ, తనికెళ్ళ రాంబాబు, సాలగ్రామ రాజా, పూజ్యం నాగేంద్ర శర్మ, నాగదేవరా లక్ష్మీనారాయణ శర్మ, భమిడి మూర్తి, ఆకుండి సూర్య ఉపాధ్యక్షులు కడియాల సత్యనారాయణమూర్తి, సెక్రటరీ జి ప్రొద్దు టూరి బాలాజీ విశ్వనాథ్ జాయింట్ సెక్రెటరీ మర్ల జగన్నాథ్ శర్మ, కోశాధికారి జి కప్పగంతుల సాయిరాం శర్మ, కార్యవర్గ సభ్యులు కందర్ప సురేష్, చీవుకుల సుబ్బారావు, కల్లూరి రామకృష్ణ, మంగిపూడి శ్రీనివాస శర్మ, ఈరంకి గోపాల కృష్ణ, విష్ణుభోట్ల సత్యనారాయణ, కల్లూరి హనుమంత్, చెల్లా రామయ్య, కొంపెల్ల వెంకట సుబ్బారావు, పాండురంగ విఠల్ పలువురు సహకరిస్తు న్నారని పసుమర్తి వివరించారు.

కృష్ణవేణిలో 'కమిటీ కుర్రోళ్లు' ప్రత్యేక షో

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక కృష్ణ వేణి థియేటర్లో స్కూల్ విద్యార్థుల కోసం కమిటీ కుర్రోళ్ళు ప్రత్యేక షోను ఆదివారం వేశారు. స్నేహ బంధం ఎలా ఉంటుంది, చిన్ననాటి మధుర జ్ఞాపకాలు గుర్తొచ్చేలా ఉంది ఇటీవల వచ్చిన కమిటీ కుర్రోళ్ళు చిత్రం. ఈ సినిమా విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను విజ్ఞానజ్యోతి స్కూల్ విద్యార్థుల కోసం వేశారు. 50 రూపాయలకే థియేటర్ యాజమాన్యం అవకాశం ఇవ్వడంతో విద్యార్థులు ఈ చిత్రాన్ని తిలకించారు. ఇటువంటి సినిమాలు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తాయని విద్యార్థులకు చూపించడం జరిగిందని విజ్ఞాన్ జ్యోతి స్కూల్ కరస్పాండెంట్ శ్రీను తెలిపారు.

శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర - పిఠాపురం : పట్టణంలో కొలువైయున్న శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానం కమిటీలో పిఠాపురం ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని ఆర్యవైశ్యులు కోరారు. ఆది వారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అభి వృద్ధి కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం పట్టణ ఆర్యవైశ్యులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, పట్ట ణ ప్రముఖ న్యాయవాది వెలగా వెంకట నగేష్ మం డల ఆర్యవైశ్య నాయకులు కేతవరపు కృష్ణ మాట్లా డుతూ ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ ఆర్య వైశ్యులకు ఇచ్చిన మాట ప్రకారం పిఠాపురం శ్రీ పాద శ్రీవల్లభ మహా సంస్థానం కమిటీలో పట్టణ ఆర్యవైశ్యులకు ప్రధమ స్థానం కల్పించాలని కోరారు. పట్టణంలో ఆర్యవైశ్యులు పూర్వకాలంలో శ్రీపాద శ్రీ వల్లభ ఆలయ అభివృద్ధికి ఎందరో ఆర్య వైశ్య దాతలు స్థల దానం చేశారని అనంతరం ఆల య అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. కూట మి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత శ్రీ వాసవి కన్య కాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం అధికారికంగా నిర్వహించటానికి ప్రభుత్వం ఉత్తర్వులు ప్రకటించ డం శుభతరణం అన్నారు. దీనిపై ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేస్తూ కూటం ప్రభుత్వానికి కృతజ్ఞ తలు తెలిపారు. పిఠాపురం నియోజవర్గంలో ఎమ్మె ల్యేగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యా ణ్ పిఠాపురం నియోజవర్గ ఆర్యవైశ్యులకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్యవైశ్యులకు అగ్రస్థానం కల్పిం చాలని కోరారు. అలాగే ఇటీవల విజయవాడ పట్ట ణాన్ని వరదలతో కకా వికలం చేసిన సంఘ టనను గుర్తు చేసుకుని బాధిత కుటుంబాలను తమ వంతు సహాయంగా ఆదుకోవాలని పిఠాపురం ఆర్య వైశ్యు లు సుమారు రెండు లక్షల పైబడి ఆర్థిక నిధు లతో కిరాణా ఇతర సామాగ్రి వారికి అందజేయా లని ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలి పారు. ఈ కార్యక్రమంలో దెంగేటి సత్యనారా యణ, సత్తిపండు, నగేష్, ఇమ్మిడిశెట్టి నాగేంద్ర, కర్ణాటకపు తాతాజీ, సతీష్, చెక్కా సు బ్రహ్మణ్యం, దత్త చలపతి, నడిపల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నిరుపేద కుటుంబం

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్ళరేవు మండలం జార్జీపేట గ్రామంలో అగ్నిప్రమాదం జరిగింది. అదే గ్రామానికి చెందిన ఇందనసాయి, ఇందన సూర్యనారాయణలకు చెందిన పెంకుటిల్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలి బూడిదయింది. ఈ ప్రమాదంలో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ఈ ప్రమాదం విద్యుత్ షాట్ సర్క్యూట్ కారణంగా జరిగినదిగా స్థానికులు భావి స్తున్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న మొత్తం సామాగ్రి బీరువాలో బట్టలు సామాన్లు అన్ని పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే స్పందిం చడంతో ప్రక్కన ఉన్న ఇంటికి ముప్పు వాటిల్ల కుండా సమయానికికూలంగా మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపనే స్థానికు లు మంటలు అదుపు చేసినప్పటికీ ఆ కుటుంబం కట్టుబట్టలతో వీధిని పడ్డాది. సుమారు నాలుగు లక్ష లు ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలి యజేశారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక సర్పంచ్ గుత్తుల సత్యవేణి సూరిబాబు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కూనపురెడ్డి కామేశ్వర రావు, ఇతర నాయకులు సందర్శించి ఆ కుటుం బానికి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వీధిన పడ్డ కుటుంబం కట్టుబట్టలతో మిగలడంతో ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

ఆదిత్య పోలీ "వేద-2కె24" పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఆదిత్య పోలీ"వేద-2కె 24" పేరిట నిర్వహించే జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను ఈనెల 13, 14 తేదీలు శుక్రవారం, శనివారాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టిఎస్ విఎస్ కుమార్ తెలిపారు. ఈనెల 15 ఆదివారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ రయ్య జయంతి సందర్భంగా 13వ తేదీ ఉదయం 9-30 నుంచి ప్రారంభమవుతాయి అని దానికి సంబం ధించిన పోస్టర్‌ను ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా ఎన్ సతీష్ రెడ్డి విడుదల చేసినట్లు తెలియ జేసారు. ఈ సందర్భంగా డా ఎన్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీర్స్ డే (మోక్షగుండం విశ్వేశరయ్య జన్మదినం) పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆదిత్యలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ "వేద- 2కె24" ద్వారా భావి ఇంజనీర్స్ యొక్క సృజనను వెలికి తీసేందుకు తద్వారా విద్యార్థుల నూతన ఆవిష్క రణలు విజ్ఞాన ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా "ఆదిత్య-వేద" విజయవంతంగా నిర్వహించడం జరుగుతుంది అని ఈ సంవత్సరం కూడా ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదిత్య పోలీ వేద-2కె 24 నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వివిధ విభాగాలలో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ప్ర జెంటేషన్, ప్రాజెక్ట్ ప్రజెంటేషన్ వంటి కాంపిటీషన్‌లతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కన బరిచిన (ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు) విజేతలకు నగదు, జ్ఞాపిక ప్రశంసాపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఎ మాధవరావు, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సేవలో జగ్గంపేట యువకులు

విశాలాంధ్ర - జగ్గంపేట : విజయవాడ వరద బాధితులకు సహాయ సేవా కార్యక్రమాలు చేశారు. జగ్గంపేట యువకులు. దాతలు అందిం చిన నిత్యావసర వస్తువులను స్థానిక మణికర్ణిక యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజ యవాడ వరద బాధితులు 80 మందికి అంద జేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న విజయవాడలో వరదలు రావడం భాదకరమన్నారు. వీరికి అందించేందుకు సహాయపడిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. టీం సభ్యులు భాదిత కుటుంబాలను కలిసి పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మణికర్ణిక టీం సభ్యులు మొగలంక శ్రీనివాస్, రామిశెట్టి దేవి, కొండ్రోతు స్వామి, గున్నాబత్తుల వీరబాబు పాల్గొన్నారు.

"ఆయ్" దర్శకుడు కంచిపల్లికి ఘనస్వాగతం

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవలే విడుదలై విజయవంతంగా నడుస్తున్న ఆయ్ సినిమా దర్శకుడు కంచిపల్లి అంజి అమలాపురం పట్టణంలో తన స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామమోహన రావు తన మిత్రబృందంతో మర్యాద పూర్వకంగా కలిశారు. సామాజిక ఇతివృత్తంతో చక్కని సందేశముతో కూడిన సినిమాకు దర్శకత్వం వహించిన అంజిను అభినందించింది . మిత్రబృందం. ఎటువంటి అశ్లీతకు తావు లేకుండా ప్రేమకథా చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూసే లాగ తీసినందుకు కోనసీమ ప్రజలు గర్వపడుతు న్నారని ఆయనకు తెలిపింది. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ ఈ సినిమాకు స్పందన బాగుందని, మొదటి వారంలోనే బ్రేక్ ఈవెన్ సాధించిందని అని అన్నారు. ముఖ్యంగా కోనసీమ ప్రజలు ఈ సినిమాను ఓన్ చేసుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. తన రెండో సినిమా కూడా గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఉండవచ్చునని తెలిపారు. ఆయన్ని కలిసిన వారిలో రంకరెడ్డి శ్రీనివాస్, సంద్యాల నాయుడు, ముత్యాల శరత్ బాబు, కరాటం ప్రవీణ్ తదితరులున్నారు.

రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు

ప్రభుత్వం కట్టుబడి ఉంది

– మోరంపూడి ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : జాతీయ రహదారిపై ఉన్న మోరంపూడి ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ ను అనుమతిస్తూ నేడు ప్రారంభించు కుంటున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటో గ్రఫీ శాఖ మంత్రి కందులు దుర్గేష్, పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం రాజమండ్రి మోరంపూడి వద్ద జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్ ను మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి గట్కారి, స్థానిక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి,ఆదిరెడ్డి వాసు కృషి వల్ల నేడు ఫ్లైఓవర్ పై సాధారణ ట్రాఫిక్‌ను ప్రారంభించు కుంటున్నామన్నారు. రహదారిపై ఉన్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించి, ప్రమాదాలు నివారించే విధంగా నేడు ఫ్లైఓవర్ ను ప్రారంభించుకోవడం చాలా ఆనందించ వలసిన విషయం అన్నారు. ఎక్కడైతే నిత్య రద్దీ వలన ప్రజల ప్రాణాలకు విఘాతం ఏర్పడుతుందో ఆయా ప్రదేశాల్లో ఫ్లైఓవర్ నిర్మించుకోవడం రద్దీని నివారించి వారి ప్రాణాలను కాపాడే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఏ దేశమైనా ఆ దేశంలో ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలని ఏర్పాటు చేసినప్పుడే అభివృద్ధి చెందుతుందన్నారు. మోరంపూడి జంక్షన్ వద్ద పై వంతెన గతంలో ఎప్పుడో ప్రారంభించుకున్నప్పటికీ త్వరితిగతిన పూర్తి కాలేదని నేడు పనులను పూర్తి చేసి ఈరోజు సాధారణ ట్రాఫిక్‌ను ఫ్లై ఓవర్ పై వాహనాలు రాకపోకలు ప్రారంభించిన అనంతరం సర్వీసు రోడ్డును కూడా అభివృద్ధి చేయడం జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు. ఈ జాతీయ రహదారిపై ఉన్న దివాన్ చెరువు, బొమ్మూరు, ఐటిసి, వేమగిరి ఫ్లై ఓవర్లను కూడా వేగవంతముగా చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియను కూడా ప్రారంభిస్తామన్నారు. త్వరలో ఆ ఫ్లైఓవర్ నిర్మాణం కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గడ్కారి ఆంధ్రప్రదేశ్ కావలసిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారని ఈ సందర్భముగా వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గతంలో రాజమండ్రి ఎంపీ గా మురళీ మోహన్ ఉన్న సమయంలో వేమగిరి నుంచి దివాన్ చెరువు వరకు ఐదు ఫ్లై ఓవర్లు మంజూరు అయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టులు నిర్మాణ ప్రక్రియ లేకుండా నిర్వీర్యం చేశారన్నారు. సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా రహదారులు, బ్రిడ్జిలు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు. రాజమండ్రి పార్లమెంటు సభ్యులు వాటిని నిర్మించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. రాజమండ్రి ప్రజలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోది, కేంద్ర మంత్రి నితిన్ గాడ్కారీ, స్థానిక ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ శాసన సభ్యులు బుచ్చయ్య చౌదరి, సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి వాసు, స్థానిక నాయకులు జాతీయ రహదారుల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ బాధితులకు కంటిపూడి సాయం

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : విజయవాడ తుఫాను బాధితుల సహాయం కోసం సీపీఐ విరాళాల సేకరణకు స్పందించిన కంటి పూడి స్టిల్స్ అధినేత ప్రముఖ వ్యాపారవేత్త, సేవాతత్పరులు కంటి పూడి సర్వారాయుడు 25 కేజీల చొప్పున 50 బియ్యం బస్తాలను ఇచ్చినట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఈ సందర్భంగా సర్వరాయుడు ఆదివారం సాయంత్రం సీపీఐ కార్యాలయానికి సందర్శించి ఆ బియ్యం అందజేశారు. సీపీఐ జిల్లా కమిటీ తరఫున ఆయనకు మధు ధన్యవాదములు తెలియజేస్తూ సీపీఐ పార్టీ చేపట్టిన ఈ వరద సహాయ కార్యక్రమంలో అందరూ తమవంతు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి విపత్తు వేళ మేమున్నామంటున్న రాజమండ్రీ పేపర్ మిల్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం రూరల్: బుడమేరు వరదలతో మునిగిన విజయవాడ పరిసర ప్రాంతాల బాధితులకు తమ వంతు సహాయంగా 4 బస్తాల సన్నబియ్యం స్థానిక సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యాలయంలో జిల్లా ఏఐటీయూసీ కన్వీనర్ కే రాంబాబు, నగర పార్టీ కార్యదర్శి కొండలరావు సమక్షంలో బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సత్యనారాయణ, కే రామకృష్ణ , బద్రరావు, రామారావు, బ్రహ్మం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో కాలుష్యాన్ని నివారించవచ్చు

విశాలాంధ్ర – అమలాపురం : పర్యావరణం పరిరక్షణలో భాగంగా వినాయక చవితి పండుగ సందర్భంగా లయన్స్ క్లబ్ దగ్గర, లైన్స్ క్లబ్ అమలాపురం వినాయకుని మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోన్ చైర్పర్సన్ జివీఎస్ మల్లిబాబు విచ్చేసినారు వారు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ వశిష్ట మట్టి వినాయకునీ ప్రతిమలను పంపిణీ చేయడం చాలా ఆనందించతగ్గ విషయమని, దీనివలన కాలుష్యాన్ని నివారించవచ్చని వినాయక చవితి పండుగ చేసుకునే భక్తులందరూ మట్టి వినాయకుని పూజించాలని భక్తులను కోరారు. ఈ కార్యక్రమానికి క్లబ్ ప్రెసిడెంట్ లయన్ రవణం వేణు గోపాలరావు, ఎంజెఎఫ్ సెక్రటరీ లయన్ వెంకటేశ్వరరావు, ప్రసాద్, లయన్ చిక్కాల సతీష్, బొక్కా నరసింహమూర్తి, క్లబ్బు సభ్యులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో వేప వృక్షానికి పున: ప్రాణ ప్రతిష్ట

విశాలాంధ్ర – కాకినాడ : జేఎన్‌టీయూకే ప్రాంగణంలోని సుమారు 40 సంవత్సరాల వయసు గల వేప చెట్టు శనివారం వర్షాల కారణంగా నేలకొరగడంతో ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ సూచనలతో ఒన్‌స్టెప్ టువార్డ్స్ సొసైటీ (ఓఎస్‌టిఎస్) సంస్థ వారు ఆదివారం ఉదయం పరీక్షల విభాగం వద్ద ఆ వృక్షానికి పున: ప్రాణ ప్రతిష్ట చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ జెఎన్‌టియుకెలో నేలకొరిగిన వృక్షాన్ని పరీక్షల విభాగం వద్దకు చేర్చి తిరిగి ప్రాణం పోయడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. ఒక వృక్షానికి మనం ప్రాణం పోస్తే ఆ వృక్షం రెండు తరాల వారికి నీడనిస్తుందన్నారు. దీనికి సహకరించిన యూనివర్శిటీ అధికారులకు, ఇంజనీరింగ్ అధికారులకు, ఓఎస్‌టిఎస్ సంస్థ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ రవీంద్రనాధ్, ఓఎస్‌డి ప్రొ కోటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ ప్రొ శ్రీనివాసులు, ఏఈఈలు సన్నీ ఫ్రాన్సిస్, నవీన్ కుమార్, ఓఎస్‌టిఎస్ ప్రతినిధులు రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

గణపతి పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని కృప, కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. ఏలూరు పవర్ పేటలోని విఘ్నేశ్వర ఆలయంలో వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకశిల విగ్రహంతో కొలువుదీరిన విజయ గణపతి చవితి మహోత్సవాలు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఎమ్మెల్యే బడేటి చంటి కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన తదితర పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటిని ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి, విఘ్నేశ్వరుని ఫోటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వరుని కృప, కటాక్షం అందరిపై ఉండాలని, అందరూ ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వరదల కారణంగా విజయవాడ ప్రజలకు కలిగిన విఘ్నాలు కూడా తొలగిపోయి, వారికి సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బడేటి రేణుక, టీడీపీ నాయకులు మామిళ్ళపల్లి పార్థసారధి దంపతులు, ఈఓ కలగర శ్రీనివాస్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లేరు లంక గ్రామాల్లో ఎమ్మెల్యే కామినేని, ఏలూరు ఆర్డిఓ పర్యటన

విశాలాంధ్ర – మండవల్లి : మండవల్లి మండలం కొల్లేరు లంక గ్రామాలైన తక్కెళ్ళపాడు, కొవ్వాడ లంక, నూచుమిల్లి గ్రామాలను ఆదివారం కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రభావిత మండలాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి బాధితులకు సహాయ పునరావాస కార్యక్రమాలు త్వరగా అమలు చేయాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు.స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నూచుమిల్లి గ్రామంలో వరద బాధితులకు రేషన్ పంపిణీ చేశారు.

దుడ్డు వారి అగ్రహారం గణపతి ఆలయం నిర్మిస్తా మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర – అమలాపురం : దుడ్డువారి అగ్రహారం బాల విద్యార్థి గణపతి సంఘం వినాయక మండపం వద్దకు శనివారం కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. జయంతి శివ అశిర్వచనం అందచేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ 60 సంవత్సరాల చరిత్ర కలిగిన దుడ్డువారి అగ్రహారం గణపతి ఆలయం మళ్ళీ వచ్చే సంవత్సరం ఆలయం నిర్మాణం చేపట్టే విధంగా ప్రయత్నం చేస్తాను అని మాట ఇచ్చారు. కమిటీ సభ్యులను స్దలం చూసుకోమని సూచించారు. ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆజాద్ నాగసుధా కొండ మరియు మంగళంపల్లి అంజిబాబు శాలువ కప్పి సత్కారించారు. ఈ కార్యక్రమంలో అడబాల బుజ్జి, పోలిశెట్టి బాబి జయంతి సురేష్, మంగళంపల్లి ప్రదీప్, గోపి రమేష్, అనుపోజు శ్రీనివాస్, కొరసిక సత్తిబాబు, దత్తుడు జయంతి శ్రీకాంత్, కొమ్మన బాలు, శిలం మహేష్, ముదపాక మణి కంఠ, దాసరి రాము, ఆనంద్ ఎస్‌కె అర్షద్, ధనబాబు, గోపాలకృష్ణ, అడబాల వినయ్, కొర్లపు వినయ్ పాల్గొన్నారు.

జనసంద్రంగా వాడపల్లి దివ్య క్షేత్రం

విశాలాంధ్ర – ఆత్రేయపురం : మండలంలోని వాడపల్లి గ్రామంలోని స్వామివారి గోవింద స్వరాలతో మార్మోగిన చందన వెంకన్న క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. గోవిందా గోవిందా హరి గోవిందా, అనే నామ స్వరాలతో ఆలయమంతా మారుమోగినది.స్వామివారి ఆలయ సన్నిధిలో ఐశ్వర్య లక్ష్మీ హెరీమం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందు తలెత్తకుండా తగు ఏర్పాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ బి కిషోర్ కుమార్ తెలిపారు. శనివారం ఒక రోజే ప్రత్యేక దర్శనం ద్వారా రూ.5,48,956 అన్నదాన ప్రసాదం ద్వారా స్వామి సేవా రూ.82, 628, లడ్డు విక్రయం రూ.2,00,535, ఆన్లైన్ ద్వారా రూ.61,616, భక్తుల విరాళం రూ.1,728, సేవలు వల్ల ఆదాయం రూ.18,60 మొత్తం రూ.9, 14,063 ఆదాయం వచ్చింది.